నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
10 | మహబూబ్‌నగర్, ఆదివారం 27 ఏప్రిల్ 2025 | NAGARKURNOOL

ప్రజల గుండెల్లో బీఆర్‌ఎస్‌ది చెరగని ముద్ర

- **రజతోత్సవ సభ నూతన శకానికి నాంది**
- **మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి**

వనపర్తి, ఏప్రిల్ 26(నమస్తే తెలంగాణ): ప్రజల గుండెల్లో బీఆర్‌ఎస్‌కు చెరగని ముద్ర ఉందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. దేశంలోనే తెలంగాణ రాష్ర్టాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి నెంబర్ వన్‌గా నిలిబెట్టిన ఘనత పదేళ్ల కేసీఆర్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ సందర్భంగా మాజీ మంత్రి శనివారం విలేకరులతో మాట్లాడారు. ఉద్యమ సంస్థగా ప్రస్థానాన్ని ప్రారంభించిన బీఆర్‌ఎస్ అనంతరం రాజకీయ పార్టీగా రూపాంతరం చెందిందన్నారు. ఉద్యమ పోరాటంతో రాష్ర్టాన్ని సాధించి, ప్రజల మద్దతుతో పరిపాలన సాగించి అభివృద్ధి.. సంక్షేమాన్ని సమపాళ్లలో ముందుకు తీసుకెళ్లిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. దేశంలోనే తెలంగాణను అన్ని రంగాల్లో అగ్రభాగాన నిలిపిన బీఆర్‌ఎస్‌కు ప్రజల్లో ఎప్పటికీ తిరుగులేదన్నారు. కేవలం ఏడాదిన్నర కాలంలోనే ఇంతలా ప్రజావ్యతిరేకత మూటగట్టుకున్న ప్రభుత్వం గతంలో ఎప్పుడూ లేదన్నారు. కాంగ్రెస్ పాలన తిరోగమన వైఖరితో కొనసాగుతుందని, అసమర్థనీయంగాను, ఈర్ష్యాద్వేషాలతో కాలయాపనసాగిస్తున్నదన్నారు. పాలనాపరంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, అందువల్లే ఇంతటి ప్రజావ్యతిరేకత వెల్లువెత్తుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నా.. కాంగ్రెస్ నాయకులన్నా ప్రజల్లో అసహనం కట్టలు తెంచుకుంటుందని, ప్రజల మనసునిండా అసంపూర్తి రగులుతుందన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్‌పై ఎప్పుడు కక్ష తీర్చుకోవాలన్న పట్టుదలతో ప్రజలు ఎదురుచూస్తున్నారని, ప్రజా వ్యతిరేకతను కాంగ్రెస్ ఏమాత్రం గుర్తించడం లేదన్నారు. ఈ క్రమంలో మళ్లీ రాష్ట్రంలో కేసీఆర్ రావాలని, బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్ర ప్రజలకు సమస్యలు తొలగుతాయన్న విశ్వాసంతో ఉన్నారన్నారు. 25ఏండ్ల బీఆర్‌ఎస్ ప్రస్థానంలో అనేకమంది త్యాగాలు చేసి అజేయులుగా నిలిచారని, మరికొందరు ద్రోహం చేసి చరిత్రలో కలిసి పోయారన్నారు. ప్రతి జిల్లా, నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు వరంగల్‌సభకు భారీగా తరలి వెళ్తున్నారని చెప్పారు. ఈ విజయోత్సవ సభ నూతన శకానికి నాందిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



ఉత్సాహంతో..
గులాబీ సేన సన్నద్ధం

- **నేడు దారులన్నీ వరంగల్ సభ వైపే..**
- **భారీగా తరలివెళ్లేందుకు పార్టీశ్రేణుల రెడీ**
- **గులాబీమయం కానున్న పల్లె, పట్టణం**
- **అధినేత కేసీఆర్‌పై ఉప్పొంగనున్న అభిమానం**
- **ఉమ్మడి పాలమూరు జిల్లాలో బీఆర్‌ఎస్ జోష్**
- **జడ్చర్ల నియోజకవర్గంలో జెండా ఎగురవేసిన మాజీ మంత్రి లక్ష్మారెడ్డి**

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉద్యమమే ఊపిరిగా.. తెలంగాణ రాష్ర్టాన్ని సాధించి.. పదేండ్ల పాలనలో దేశమే ఆశ్చర్య పోయేలా అభివృద్ధిని సాధించిన బీఆర్‌ఎస్ పార్టీ 25వ రజతోత్సవ పండుగ వేడుకకు ఉమ్మడి పాలమూరు సంసిద్ధమైంది. ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న రజతోత్సవానికి బీఆర్‌ఎస్ శ్రేణులు, అభిమానులు భారీగా తరలి వెళ్లనున్నారు. పార్టీ ఇచ్చిన పిలుపుతో ఇప్పటికే పట్టణాలు, మండలాలు, గ్రామాల్లో వాల్‌రైటింగ్, జెండాల రెపరెపలతో గులాబీమయంగా మారాయి. మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ అధ్యక్షులు నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట, జోగుళాంబ గద్వాల, వనపర్తి జిల్లాల నుంచి భారీగా తరలి వెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మా రెడ్డి ఎమ్మెల్సీలు చల్లా వెంకట్రామిరెడ్డి, నవీన్‌కుమార్ రెడ్డి, వాణీదేవి, గోరటి వెంకన్న, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్ రెడ్డి, బీరం హర్షవర్ధన్ రెడ్డి పట్నం నరేందర్ రెడ్డి ఆల వెంకటేశ్వర్ రెడ్డి జైపాల్ యాదవ్, గువ్వల బాలరాజు, మర్రి జనార్దన్ రెడ్డి రాజేందర్ రెడ్డి పార్టీ శ్రేణులు తరలి వెళ్లేందుకు ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. వాహనాలు, భోజన వసతి కల్పిస్తున్నారు. అలంపూర్, గద్వాల, కొల్లాపూర్, అచ్చంపేట, మక్తల్, నారాయణపేట నియోజకవర్గాలకు చెందిన కార్యకర్తలు శనివారం అర్ధరాత్రి నుంచే వరంగల్ సభకు బయలుదేరి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

కేసీఆర్ కావాలనే డిమాండ్లు

తెలంగాణ ఉద్యమ నేత కేసీఆర్ మొక్కవోని దీక్షతో సాధించిన తెలంగాణను పదేండ్లలో ఊహించని అభివృద్ధిని సాధించారు. కాగా, కాంగ్రెస్ పార్టీ బోగస్ హామీలను నమ్మిన ప్రజలు అధికారం కట్టబెట్టగా, 15 నెలల్లోనే అసమర్థ పాలన బట్టబయలైంది. దీంతో మళ్లీ కేసీఆర్ రావాలని ప్రజల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ స్థాపించి 25ఏండ్లు అవుతున్న నేపథ్యంలో నిర్వహిస్తున్న సభకు ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్నది. ఈ చారిత్రాత్మక సభకు తరలివెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉత్సాహం చూపిస్తున్నారు. భగభగ మండే ఎండలను సైతం లెక్కచేయకుండా బయలుదేరి వెళ్తున్నారు.

వరంగల్ సభలో ఉమ్మడి జిల్లా మార్క్

తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన కేసీఆర్‌ను అక్కున చేర్చుకున్నది ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా. పార్టీ ఆవిర్భావం నుంచి రజతోత్సవం వరకు కేసీఆర్ వెంటే జనం ఉన్నారు. 25 ఏండ్ల ఆవిర్భావ పండుగకు నాయకులు, కార్యకర్తల్లో మరింత జోష్ పెరిగింది. మరోసారి ఉమ్మడి జిల్లా మార్క్‌ను సభలో చాటిచెప్పేందుకు ఉవ్విళ్లురుతున్నారు.

రజతోత్సాహం

బీఆర్‌ఎస్ 25ఏండ్ల పండుగ సందర్భంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గులాబీ జోష్ నెలకొన్నది. ఒక రోజు ముందు నుంచే రజతోత్సవ ఉత్సవాలు ప్రారంభించారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గంలో మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన గులాబీ జెండా ఆవిష్కరణ చేశారు. బీఆర్‌ఎస్ జిందాబాద్.. కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు.

జడ్చర్లలో బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న లక్ష్మారెడ్డి

ప్రజలు కేసీఆరే కావాలంటుండ్రు

- **బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి**
- **జడ్చర్లలో ముందుగానే గులాబీ జెండా పండుగ**
- **అన్నివార్డుల్లో ఆవిష్కరించిన లక్ష్మన్న**

జడ్చర్ల టౌన్, ఏప్రిల్ 26: రాష్ట్రంలో తెలంగాణ ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్నే కోరుకుంటున్నారని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మారెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గులాబీ జెండాపండుగను శనివారం బీఆర్‌ఎస్ శ్రేణులు జడ్చర్లలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పాల్గొని పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. మొదట కావేరమ్మపేటలో పార్టీ జెండాను ఎగురవేసి సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పార్టీశ్రేణులు పెద్దఎత్తున పటాకులు కాల్చారు. జై తెలంగాణ.. జై కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం జడ్చర్ల మున్సిపాలిటీలోని 27వార్డులతో పాటు మండలంలోని గంగాపూర్‌లో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ..వరంగల్‌లో బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం కనీవిని ఎరుగని రీతీలో జరుగుతుందని.. జిల్లా నుంచి దండులా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, మహేశ్, జ్యోతికృష్ణారెడ్డి, శశికిరణ్, సారికా రామ్మోహన్, దేవ, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రఘుపతిరెడ్డి, నాయకులు యాదయ్య, సత్యం, మురళి, హఫీజ్, శంకర్‌నాయక్, రవీందర్‌గౌడ్, శ్రీనివాసులు, శ్రీనివాస్‌యాదవ్, ఇర్ఫాన్, శేఖర్ రెడ్డి కరాటే శ్రీను, పవన్, పరమటయ్య, తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచేలా రజతోత్సవ సభ

- **నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి**

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 26: బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ చరిత్రలో నిలిచిపోయేలా రజతోత్సవ సభ నిర్వహిస్తున్నారని.. రాజకీయాలు, సిద్ధాంతాలు పక్కనపెట్టి 60 ఏండ్ల తెలంగాణ కలని సాకారం చేసిన రజతోత్సవ సభకు లక్షలాదిగా తరలి వెళ్దామని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి నియోజకవర్గ పార్టీ శ్రేణులు, ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రసాధనే లక్ష్యంగా కేసీఆర్ స్థాపించిన బీఆర్‌ఎస్ అన్ని సందర్భాల్లో తెలంగాణ ప్రజలకు గుండె ధైర్యాన్ని ఇచ్చిందన్నారు. బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 24ఏండ్లపాటు ఎన్నో పోరాటాలు చేసి స్వరాష్ట్రం సాధించి ప్రజల అభీష్టం మేరకు ప్రభుత్వంలో ఉండి తెలంగాణను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి 25వ వార్షికోత్సవంలో అడుగుపెడుతున్న సందర్భంగా వరంగల్‌లోని ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహిస్తున్న పార్టీ రజతోత్సవ భారీ బహిరంగసభను విజయవంతం చేయాలని నాగర్‌కర్నూల్ నియోజకవర్గ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కేసీఆర్ మాట వినాలని, ఆయన మాట వింటే గుండె ధైర్యం వస్తదని ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. ప్రజలు కేసీఆర్ మాటలు వింటే కాంగ్రెస్ అరాచక పాలన అంతమవుతదనే భరోసా కలుగుతుందన్నారు. ఎల్కతుర్తిలో జరగబోతున్న సభ ఆషామాషీ సభ కాదని.., దేశ రాజకీయ చరిత్రలో నిలిచి పోయే మహాసభగా నిలుస్తదన్నారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గ నుంచి పెద్ద ఎత్తున వరంగల్ సభకు ప్రజలు, పార్టీ శ్రేణులు స్వచ్ఛందంగా వెళ్తున్నామని తెలిపారు. గ్రామాలు, మున్సిపాలిటీ వార్డుల్లో పార్టీ శ్రేణులు ఎక్కడికక్కడ గులాబీ జెండాలు ఎగరవేసి బయలుదేరాలని సూచించారు. ఆదివారం సాయంత్రం 4:30 గంటలకు కేసీఆర్ మహాసభ ప్రాంగణానికి చేరుకుంటారని, సాయంత్రం 5:30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. సమయానికి కంటే ముందుగానే ఎల్కతుర్తి చేరుకోవాలని నియోజకవర్గ పార్టీ శ్రేణులు, ప్రజలు, తెలంగాణ అభిమానులకు పిలుపునిచ్చారు.

సభ ప్రభంజనం కావాలి

- **మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి**

మక్తల్, ఏప్రిల్ 26: బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో తరలిరావాలని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి శనివారం ప్రకటనలో పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఉదయం 6గంటలకు మక్తల్ మున్సిపాలిటీలోని యాదవనగర్‌తోపాటు గుడిగండ్లలో పార్టీ జెండా ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మక్తల్, మాగనూర్, ఊట్కూర్, నర్వ, ఆత్మకూర్, అమరచింత, కృష్ణ మండలాలకు చెందిన కార్యకర్తలతో కలిసి సభకు బయలుదేరి తరలి వెళ్తున్నట్లు తెలిపారు. సభకు బయలుదేరేందుకు నియోజకవర్గంలో మండలాలకు కేటాయించిన వాహనాల్లో కార్యకర్తలు తరలిరావాలని సూచించారు. నియోజకవర్గ నుంచి 17బస్సులు, వంద వాహనాల్లో కార్యకర్తలు తరలి వెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

మక్తల్‌లో జెండా పండుగకు సిద్ధమైన పైపు

బీఆర్‌ఎస్ సభను సక్సెస్ చేయాలి

- **స్వచ్ఛందంగా తరలివచ్చేలా యువత**
- **అధికారం కాంగ్రెస్‌కు శాశ్వతం కాదు**
- **మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు**

అచ్చంపేట టౌన్, ఏప్రిల్ 26 : వరంగల్‌లో నిర్వహించే రజతోత్సవ సభను సక్సెస్ చేయాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు పిలుపునిచ్చారు. శ్రేణులతోపాటు యువకులు, అభిమానులు సైతం స్వచ్ఛందంగా తరలిరావాలన్నారు. బీఆర్‌ఎస్ సభకు పురస్కరించుకొని శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గులాబీ పార్టీ ఆవిర్భవించి 25 ఏండ్లు అవుతున్న సందర్భంగా నిర్వహించే పండుగకు పెద్ద ఎత్తున తరలాలన్నారు. అధికారం శాశ్వతం కాదని.. అధికారులు గుర్తుంచుకోవాలి ప్రభుత్వం శాశ్వతం కాదని.. వ్యవస్థలో అందరికీ పనిచేయాలని పేర్కొన్నారు. మన్ననూర్‌లో పార్టీ దిమ్మెను నిర్మించుకొని జెండా ఎగురవేద్దామనుకుని యువకులు ప్రయత్నిస్తుంటే పోలీసులు పార్టీ దిమ్మెకు అడ్డంగా నిలబడి కార్యక్రమానికి విఘాతం కలిగిస్తూ అక్కడకు వచ్చిన కార్యకర్తలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారని వాపోయారు. అమ్రాబాద్ ఎస్సై, అచ్చంపేట సీఐకి ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఫోన్ లిఫ్ట్ చేయలేదని, డీఎస్పీ పల్లె శ్రీనివాస్‌కి ఫోన్ చేసి మాట్లాడానని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, అమీనోద్దీన్, రమేశ్‌రావు, నర్సయ్య, తిరుపతయ్య, ఖాజా కుతుబుద్దీన్, రవీందర్‌రావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అచ్చంపేటలో మీడియాతో మాట్లాడుతున్న గువ్వల బాలరాజు

ఆగుతూ.. సాగుతూ..

- **ఎస్‌ఎల్‌బీసీ సహాయక చర్యలు**

అచ్చంపేట, ఏప్రిల్ 26: దోమలపెంట శ్రీశైలం ఎడమగట్టు సొరంగంలో సహాయక చర్యలు ఆగుతూ.. సాగుతున్నాయి. టన్నెల్‌లో ప్రమాదం జరిగి శనివారం నాటికి 64వ రోజుకు చేరుకుంది. కేంద్ర, రాష్ట్ర 12 విభాగాలకు చెందిన రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొన్నారు. టన్నెల్‌లో చిక్కుకున్న మిగిలిన ఆరుగురి మృతదేహాలు లభించకపోవడం, డేంజర్ జోన్‌లో సహాయక చర్యలు ఆగిపోవడంతో చేసేదిలేక చాలామంది తిరిగి వెళ్లిపోయారు. ప్రస్తుతం టన్నెల్‌లో కేవలం రైల్వే, హైడ్రా, ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది మాత్రమే ఉన్నారు. సింగరేణి మైన్స్ రెస్క్యూ సిబ్బంది 39మంది శనివారం ఉదయం తిరిగి వెళ్లి పోయారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఆర్మీ, ర్యాట్‌హోల్ మైనర్స్ వెళ్లి పోయారు. ప్రస్తుతం మూడు విభాగాల వారిలో దాదాపు 100-120 మంది వరకు ఉంటారు. ప్రస్తుతం అక్కడున్నది హైడ్రా, రైల్వే, ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందికి టన్నెల్ లోపల చేసేందుకు ఎలాంటి పనులు లేక ప్రభుత్వం నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నారు. టన్నెల్ లోపల ఉబికి వస్తున్న నీటిని నిరంతరం డీవాటరింగ్ చేస్తున్నారు. సహాయక సిబ్బంది చేసేందుకు లోపల ఎలాంటి పనులు లేక లోపలికి వెళ్లి మళ్లీఏమైనా లీకేజీలు ఉన్నాయా? అంటూ చూసి వస్తున్నారు. టన్నెల్ లోపల మొత్తం పేరుకుపోయిన శిథిలాలు, బండరాళ్లు, కూలిపడిన సిమెంట్ సెగ్మెంట్లు 3, మట్టి, బురద, స్టీల్ మొత్తం బయటకు తరలించి 281 మీటర్ల వరకు సహాయక చర్యలు పూర్తి చేశారు. మిగిలిన 43మీటర్లు డేంజర్ జోన్ అంటూ బోర్డు, కంచె ఏర్పాటు చేశారు. నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలు, జీఎస్‌ఐ నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం అక్కడ సహాయక చర్యలు తాత్కాలికంగా నిలిపి వేసింది. ప్రభుత్వం నియమించిన టెక్నికల్ కమిటీ సభ్యులు ఎన్‌ఐఆర్‌ఎం చీఫ్ శాస్త్రవేత్త మైతానీ ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ఇన్‌లెట్, అవుట్‌లెట్‌ను పరిశీలించారు. టన్నెల్ అవుట్‌లెట్ వద్ద పనులు ప్రారంభించేందుకు పరిశీలించినట్లు తెలిసింది. ఈ ప్రాజెక్టు ముందుకు వెళ్లేందుకు తీసుకునే చర్యల గురించి అధ్యయనం చేసేందుకు పరిశీలించారు. ఆయన టెక్నికల్ కమిటీకి నివేదిక ఇవ్వనున్నారు. ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని శనివారం కలెక్టర్ బాదావత్ సంతోష్ శనివారం ప్రకటనలో తెలిపారు. డీవాటరింగ్ ప్రక్రియ, టీబీఎం శిథిలాల తొలగింపు, కన్వేయర్ బెల్టుతో మట్టి తరలింపు ప్రక్రియ కొనసాగుతుందని, సాంకేతిక కమిటీ సూచనల మేరకు సహాయక చర్యలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలైన ఎన్‌డీఆర్‌ఎఫ్, ఆర్మీ, సహాయక బృందాలు తప్పా మిగిలిన అన్ని సహాయక బృందాలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు.

చర్యల్లో ప్రభుత్వం విఫలం : నిరంజన్‌రెడ్డి

ఎస్‌ఎల్‌బీసీ ప్రమాద ఘటన చర్యల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. అర్థాంతరంగా సహాయక చర్యలను విరమించుకోవడం, మరో ఆరుగురు కార్మికుల మృతదేహాలను బయటకు తీయకుండా ముగించడం బాధాకరమన్నారు. చర్యలపై ఎలాంటి సమీక్ష లేకుండా హడావుడిగా సహాయక చర్యలను నిలిపి వేయడం దారుణమన్నారు. హెలీక్యాప్టర్‌లో తిరిగి, చేపల కూరలు తిని హంగామా చేశారే తప్పా మరొకటి లేదన్నారు. మంత్రులు, సీఎం సహాయక చర్యలు నిలిపివేస్తున్నామని ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. కేవలం ఇద్దరి మృతదేహాలను మాత్రమే బయటకు తీసి 63రోజుల తర్వాత మిగిలిన వారిని గుర్తించకుండా చేతులెత్తేశారన్నారు. కనీసం చివరి చూపునకు కూడా కార్మికుల కుటుంబాలకు దక్కనీయలేదని, ఇంతటి దయనీయ పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిందన్నారు. ఎస్‌ఎల్‌బీసీ సొరంగం ప్రమాద సహాయ చర్యలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

అలంపూర్ ఆలయ అర్చకుడికి ఊరట

- **ఆనంద్‌శర్మ సస్పెన్షన్ నిలిపివేస్తూ హైకోర్టు నిర్ణయం**

అలంపూర్, ఏప్రిల్ 26 : ఈనెల 24వ తేదీన అలంపూర్‌లోని జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాల అర్చకుడు ఆనంద్‌శర్మను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.. కాగా అర్చకుడు తనపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవాలు లేవని.. ఏ ఆరోపణకు ఏ విధమైన పనిష్మెంట్ ఇచ్చారో స్పష్టత లేదని దేవాదాయ శాఖ ఉత్తర్వులను సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించాడు. పిటిషనర్ తరపు న్యాయవాది వినిపించిన వాదనలతో జస్టిస్ నగేశ్ భీమపాక.. ఆనంద్ శర్మపై వచ్చిన ఆరోపణలు, రుజువైన విధానం తెలియజేయడంలో స్పష్టత లేదని.. అలాంటి సందర్భంలో సస్పెన్షన్ సరికాదని నిర్ణయించింది. కేసు విచారణ జూన్ 26వ తేదీన వచ్చే వాయిదాలోపు కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదికి నోటీసులు జారీ చేసినట్టు పేర్కొన్నారు. అప్పటి వరకు విధుల్లో యథావిధిగా కొనసాగవచ్చన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు

నాగర్‌కర్నూల్ రూరల్, ఏప్రిల్ 26: మండలంలోని మంతటి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కేశమల్ల రమేశ్ బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి బీఆర్‌ఎస్ కండువాకప్పి కేశమళ్ల రమేశ్‌ను పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలు, రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో గ్రామంలో ప్రజలకు సమాధానం చెప్పలేక పార్టీ పెద్దల విధానాలు నచ్చక బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు కేశమల్ల రమేశ్ తెలిపారు.

కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రి

'ఇందిరమ్మ' ఇండ్ల సర్వేలో అధికారుల నిలదీత

మక్తల్, ఏప్రిల్ 26: ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియ ఫీల్డ్ సర్వేలో రసాభాస చోటు చేసుకున్న ఘటన మక్తల్ మండలం మంతన్‌గోడ్‌లో శనివారం ఉదయం చోటుచేసుకున్నది. వివరాలిలా.. స్థానిక కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ కమిటీలో కాంగ్రెస్ పార్టీ వ్యక్తులను మాత్రమే ఏకగ్రీవంగా ఎన్నుకొని, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పార్టీకి చెందిన వారి సమాచారాన్ని అందించారు. దీంతో అసలైన అర్హుల జాబితాను ఎంక్వైయిరీ చేయాలని ఆదేశాలు జారీ కావడంతో, శనివారం ఉదయం పీఆర్ ఏఈ అరుణ్‌కుమార్‌రెడ్డి మంతన్‌గోడ్‌లో 35మంది స్థితిగతులను తెలుసుకునేందుకు గ్రామంలోకి వెళ్లాడు. అయితే లబ్ధిదారుల పేర్లు బయటికి చెప్పకుండా ఫీల్డ్ సర్వేకు ఏ విధంగా వస్తారని గ్రామస్తులు నిలదీశారు. ఈ సందర్భంగా అధికారి స్పందిస్తూ తమకు ఇచ్చిన పేర్లు ఫైనల్ కాదని ఇందిరమ్మ కమిటీ ఇచ్చిన పేర్లను ఫీల్డ్‌లో పరిశీలించి, అర్హులను గుర్తించడానికని తెలిపాడు.

ఇండ్ల పరిశీలనకు వెళ్లిన అధికారులను చుక్కెదురు

తిమ్మాజిపేట, ఏప్రిల్ 26: మండలంలోని ఆర్‌సీతండాలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను పరిశీలించేందుకు వెళ్లిన అధికారులను శనివారం స్థానికులు అడ్డుకున్నారు. ఎంపీడీవో లక్ష్మీదేవి నేతృత్వంలోని అధికారులు గ్రామంలో పరిశీలన జరుపుతుండగా,. అక్కడికి వచ్చిన కొందరు అధికారులను ప్రశ్నించారు. ఇండ్లు ఉన్నవారివే పరిశీలిస్తున్నారని, ఒక పార్టీవారు చెప్పిన వారికే ప్రాధాన్యత ఇస్తున్నారని నిలదీశారు. ఇది కేవలం పరిశీలన మాత్రమేనని ఎంపీడీవో వారికి నచ్చజెప్పడానికి ప్రయత్నించిన వారు వినలేదు. నిరుపేదలకు ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగారు. దీనిపై ఎంపీడీవో సంప్రదించగా.. ఇది ఎంపిక కోసం కాదని, దరఖాస్తులు చేసుకున్న వారి స్థితిగతులు పరిశీలించడానికి వెళ్లామని తెలిపారు.

రచ్చకెక్కిన కల్లు పంచాయితీ

- **ఒక వర్గం దుకాణంపై మరో వర్గం సభ్యుల దాడి**

అమరచింత, ఏప్రిల్ 26: కల్లు పంచాయితీ మరింత ముదరడంతో శనివారం ఒక వర్గం దుకాణాదారులు చరులు మరో వర్గం కల్లు దుకాణంపై దాడి చేసి 14ట్రేలను ధ్వంసం చేయగా.. 200లీటర్ల కల్లు నేలపాలైంది పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితులు చంద్ర కాలగౌడ్, గిరిధర్‌గౌడ్ కథనం ప్రకారం.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సొసైటీ సభ్యులు అమరచింత పట్టణంలోని కల్లు దుకాణం లైసెన్స్ అలమేదర్‌గౌడ్ పేరుపై ఉండగా.. నిర్వహణ బాధ్యతను మాజీ సర్పంచ్ గంగాధర్‌గౌడ్‌కు అప్పగించారు. కొన్ని నెలలపాటు సభ్యులకు షేర్ల పంపకంలో గంగాధర్‌గౌడ్ తేడా చూపడంతో లైసెన్స్ కలిగిన అలమేదర్‌గౌడ్ మరో ఇద్దరితో కలిసి పట్టణంలో వేరే కల్లు దుకాణం ఏర్పాటు చేశాడు. ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకపోవడంతో గంగాధర్‌గౌడ్ మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లడంతో సొసైటీ సభ్యులు గొడవలు లేకుండా దుకాణాలు నిర్వహించుకోవాలని సూచించారు. సద్దుమనిగిన వివాదం ఇప్పుడు మరోసారి మొదలైంది. గంగాధర్‌గౌడ్ వర్గానికి చెందిన వెంకటన్నగౌడ్, వెంకటేశ్ అకారణంగా అలమేదర్‌గౌడ్ కల్లు దుకాణంపై దాడి చేసి రెండు వందల సీసాల కల్లును ధ్వంసం చేశారని వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు చంద్ర కాలగౌడ్, సురేందర్‌గౌడ్ ఆత్మకూర్ పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఆత్మకూర్ ఎస్సై నరేందర్‌ను వివరణ కోరగా.. ఫిర్యాదు చేసిన వారికి కల్లు దుకాణం నిర్వహణకు అనుమతులు లేవని, వారు సొసైటీలో సభ్యులు కూడా కారని తెలిసింది. అనుమతి పత్రాలు చూపించి ఫిర్యాదు చేస్తే దాడి చేసిన వారిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు.

ఎస్సైని మాట్లాడుతున్నా.. రూ.20వేలు పంపించు

- **పెట్రోల్‌బంక్ యజమానికి డబ్బులు వేయమని ఫేక్‌కాల్**

మూసాపేట, ఏప్రిల్ 26: అడ్డాకుల ఎస్సైని మాట్లాడుతున్నా.. అర్జెంట్ అవసరం ఉంది.. స్కానర్ పెడుతున్నా వెంటనే రూ.20వేస్తే కానిస్టేబుల్‌తో నగదు పంపుతానని మూసాపేట మండలంలోని జానంపేట శివారులోని పెట్రోల్‌బంక్ మేనేజర్ రాజేశ్‌కు ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. అనుమానంతో రాజేశ్ ఫోన్‌కట్ చేసి ట్రూకాలర్‌లో నెంబర్, అందులో వచ్చిన ఫొటోను తెలిసిన వారికి పంపి అడ్డాకుల ఎస్సైయేనా అని ఆరాతీశాడు. ఎస్సై కాదని తేలడంతో అప్రమత్తమై డబ్బులు వేయలేదు. ఈ విషయం అడ్డాకుల ఎస్సై శ్రీనివాసులు వరకు వెళ్లడంతో తన పేరుతో పెట్రోల్ బంక్ నిర్వాహకుడికి ఫేక్‌కాల్ వచ్చిందని, గుర్తింపు ఉన్నవారి పేర్లతో ఫోన్‌చేసి డబ్బులు వేయమని అడిగితే వేయరాదన్నారు. సైబర్ నేరగాళ్లు కొత్త కోణంలో మోసాలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. ఫోన్ నెంబర్, స్కానర్‌పై పోలీసులు ఆరా తీస్తున్నట్లు తెలిపారు.

గన్నీబ్యాగులు ఎప్పుడిస్తరు?

- **ధన్వాడ పీఏసీసీఎస్ ఎదుట రైతుల ధర్నా**
- **సంచులిస్తామని అదనపు కలెక్టర్ హామీతో విరమణ**

ధన్వాడ, ఏప్రిల్ 26: వారం రోజుల నుంచి గన్నీ బ్యాగుల ఎప్పుడిస్తరని రైతులు కన్నెర్ర చేశారు. సంచుల కోసం పీఏసీసీఎస్ చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో శనివారం వివిధ గ్రామాల రైతులు ధన్వాడ సింగల్ విండో కార్యాలయాన్ని ముట్టడించారు. అధికారులు వచ్చే వరకు ఆందోళన చేపట్టారు. నారాయణపేట అదనపు కలెక్టర్ బెన్ షాలం రైతుల వద్దకు చేరుకొని రైతులకు సరిపడా గన్నీ బ్యాగులను అందిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమించారు. ప్రతి రోజూ మూడు లారీల ధాన్యం పంపించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అనంతరం ధన్వాడ, గోటూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు ఎలా చేస్తున్నారని.. రికార్డులు సక్రమంగా లేక పోవడంపై విండో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంత ధాన్యం కొనుగోలు చేశారు. ఎంత తరలించారనే విషయాలు రికార్డులో ఉంచాలన్నారు. సీరియల్ ప్రకారం రైస్ మిల్లులకు ధాన్యాన్ని తరలించాలని సూచించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డీఎం సైదులు, తాసీల్దార్ సింధూజ, విండో చైర్మన్ వెంకట్రాంరెడ్డి, సీఈవో వెంకట్రాములు, ఏఈవో జైన్‌సింగ్, రైతులు మొగులప్ప, నర్సింహులు, సిద్ధు, రాజు, ప్రభాకర్, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ విండో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు